అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించండి



వినతి పత్రం అందజేస్తున్న పావనీజంగయ్య

ఘట్‌కేసర్: ఆరు గ్రామాలు విలీనమైన నేపథ్యంలో మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని చైర్ పర్సన్ పావనీజంగయ్య ఆధ్వర్యంలో టీ పీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వజ్రేశ్‌యాదవ్, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి గురువారం వినతి పత్రం అందజేశారు. అభివృద్ధి పనులకు మున్సిపాలిటీలో నిధులు లేనందున ప్రత్యేక బడ్జెట్ ఇప్పించాలని లేఖలో కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ముత్యాలు యాదవ్, రాధాకృష్ణ ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మశ్చేందర్‌రెడ్డి, కౌన్సిలర్ మల్లేశ్, జంగయ్యయాదవ్, మాధవరెడ్డి, దేవేందర్‌ముదిరాజ్, జంగయ్య ముదిరాజ్, సందీప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అమర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా రమేష్‌గుప్తా



రమేష్‌గుప్తాను అభినందిస్తున్న దృశ్యం

కీసర: ఆర్యవైశ్య సంఘం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా బెలిదే రమేష్‌గుప్తా ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో గురువారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కార్యాలయం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం జగదీర్‌గుట్టలో నిర్వహించిన ఎన్నికల్లో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఓటింగ్‌లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా మహాసభలో ఉన్న 239 ఓట్లకు గాను 218 సభ్యులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. అధ్యక్ష బరిలో బలిదే రమేష్‌గుప్తా, రేబెల్లి శ్రీనివాస్‌గుప్తా నిలిచారు. రేబెల్లి శ్రీనివాస్ గుప్తాపై 110 ఓట్ల భారీ మెజారిటీతో కీసర గ్రామవాసి బెలిదే రమేష్‌గుప్తా ఘన విజయం సాధించారు. రేబెల్లి శ్రీనివాస్‌కు 54 ఓట్లు రాగా రమేష్‌గుప్తాకు 164 ఓట్లు లభించాయి. ఈ సందర్భంగా రమేష్‌గుప్తా మాట్లాడుతూ... తన గెలుపునకు కృషిచేసిన బెల్లి శ్రీనివాస్, బచ్చు నాగేశ్వరతోపాటు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు.

వానొస్తే వణుకే!

- ముంపు బారిన పడుతున్న మైసమ్మగూడ
- ప్రైవేటు హాస్టళ్ల భవనాల్లోకి చేరుతున్న వరద నీరు
- ఆందోళనతో ఖాళీ చేసి వెళ్లిపోతున్న విద్యార్థులు
- తాత్కాలిక చర్యలకే పరిమితం అవుతున్న అధికారులు



భారీ వర్షానికి మైసమ్మగూడ రోడ్డులో నిలిచిన నీరు



మైసమ్మగూడలోని హాస్టళ్ల వద్ద చెరువును తలపిస్తున్న దృశ్యం (ఫైల్)

మేడ్చల్‌రూరల్: వర్షాకాలం ప్రారంభమైతే మైసమ్మగూడ ప్రాంతవాసులకు వణుకు పుడుతుంది. భారీ వర్షం కురిసిందంటే చాలు ఆయా ప్రాంతాల్లోని పలు కాలనీలు చెరువులను తలపిస్తాయి. ఇక ఆ ప్రాంతంలో ఉన్న హాస్టళ్ల పరిస్థితి మరింత ఆందోళనకరంగా తయారవుతుంది. ఆయా హాస్టళ్లలో ఉండే విద్యార్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని హాస్టల్ భవనాలను ఖాళీ చేసి ఇళ్లకు వెళ్లాల్సిన వస్తుందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉంటుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇదీ మూడేళ్లుగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలో నెలకొంది.

- గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మైసమ్మగూడలో మల్లారెడ్డి యూనివర్సిటీతో పాటు పదుల సంఖ్యలో ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ఆయా విద్యా సంస్థల్లో విద్యాభ్యాసం చేసే విద్యార్థుల కోసం వందల సంఖ్యలో ప్రైవేటు హాస్టళ్లను ఏర్పాటు చేశారు. సుమారు 20 నుంచి 30 వేల మంది విద్యార్థులు కళాశాలల్లో విద్యనభ్యసిస్తూ ఆయా హాస్టళ్లలో నెలకు వేలాది రూపాయలు చెల్లిస్తూ వాటిలో ఉంటున్నారు. కొందరు ధనార్జనే ధ్యేయంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మించి అరకొర వసతులు కల్పిస్తున్నారు. వర్షాకాలంలో హాస్టళ్లలోకి వర్షపు నీరు చేరడం షరామామూలు కావడంతో వాటిల్లోని విద్యార్థులను ఆందోళనకు గురి చేస్తున్న అంశం.
- గత నెలలో ఓ సారి, ఈ నెల మొదటి వారంలో కురిసిన భారీ వర్షాల కారణంగా పలు మార్లు పలు హాస్టళ్ల భవనాల్లోకి వరదనీరు చేరాయి. గతేడాది సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు మైసమ్మగూడ పూర్తిగా జలమయం కాగా కళాశాలలు, హాస్టల్ పరిసరాలు చెరువులను తలపించాయి. దీంతో హాస్టళ్లలో చిక్కుకున్న విద్యార్థులను నానా కష్టాలు పడి జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో బయటికి తీసుకొచ్చిన మున్సిపల్ అధికారులు వరదలు తగ్గేంత వరకు కళాశాలలకు సెలవులు ప్రకటించారు. వరదలు తగ్గే వరకు పరుగులు పెట్టిన అధికారులు అనంతరం ఆ తర్వాత అటువైపు కన్నెత్తి చూడలేదు. ఈ నెల మొదటివారంలో మరోమారు హాస్టళ్లు ముంపునకు గురికావడంతో సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు తప్ప శాశ్వత పరిష్కారం కోసం ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

నాలాలు, కుంటల కబ్జానే కారణమని తెలిసినా...

- మైసమ్మగూడలోని హాస్టల్ భవనాలను వరద ముంపునకు గురికావడానికి ప్రధాన కారణం నాలాలు, కుంటలు కబ్జాకు గురవడమే కారణమని తెలిసినా అధికారులు మాత్రం వాటిని తొలగించడం లేదు. గతంలో హాస్టళ్ల భవనాలు ముంపు బారిన పడిన సమయంలో హడావిడి చేసిన అధికారులు నాలాలపై అక్రమంగా నిర్మించిన భవనాలను తొలగిస్తామన్నారు. ఆ తరువాత మున్సిపల్ అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడలేదు.
- మరోవైపు కోమటి చెరువు నుంచి సుమాల్ చెరువు మీదుగా ఫాక్ సాగర్‌కు వరద నీరు వెళ్లే నాలాల సమీపంలో కొత్తగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నా అధికారులు వాటిని అడ్డుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
- ఇటీవల మైసమ్మగూడలో హైడ్రా అధికారులు తనిఖీలు నిర్వహించిన నేపథ్యంలో నాలాలు, కుంటలను కబ్జా చేసి అక్రమంగా నిర్మించిన భవనాలను తొలగిస్తారా.. లేదా.. అని వేచి చూడాలి.

ముంపు నుంచి విముక్తి కల్పిస్తాం

మైసమ్మగూడలో విద్యార్థులు వరద ముంపు సమస్యతో ఇబ్బందులు పడకుండా చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే వర్షపు నీరు నాలాల గుండా సాఫీగా వెళ్లేందుకు పైప్‌లైన్ ఏర్పాటు చేశాం. దీంతో వర్షపు నీరు భవనాల ముందు నిలవకుండా పైపుల గుండా నాలాలలో వెళ్లిపోతుంది. భారీ వర్షం కురిసిన సమయంలో సైతం ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మరిన్ని చర్యలు చేపడతాం. నాలాలపై అక్రమంగా నిర్మించిన భవనాలను గుర్తించి వాటికి నోటీసులు జారీ చేస్తాం.

– స్వామి, మున్సిపల్ కమిషనర్, గుండ్లపోచంపల్లి



ముంపు కారణంగా ట్రాక్టర్‌లో బయటికి వస్తున్న విద్యార్థినులు



హాస్టళ్లలోకి చేరిన వరద నీరు



వరదలోంచి బయటికెళ్తున్న విద్యార్థినులు (ఫైల్ ఫొటోలు)

జవహర్‌నగర్ అభివృద్ధే లక్ష్యం: మేయర్ శాంతి



భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న మేయర్ శాంతి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 19వ డివిజన్‌లో మేక లలితాయాదవ్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీనగర్‌లో మున్సిపల్ సాధారణ నిధులు రూ. 10 లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ పనులను గురువారం మేయర్ శాంతి కోటేష్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ శాంతి మాట్లాడుతూ... జవహర్‌నగర్ కార్పొరేషన్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు కోటేష్‌గౌడ్, వినోద్, రాజుగౌడ్, అరుణ పాల్గొన్నారు.

నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ కళాశాలలో గురువారం మైక్రోసాఫ్ట్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మైక్రోసాఫ్ట్ సంస్థ ప్రతినిధులు అంకిత సింగ్, నేత్ర, అజూర్ డెవలపర్స్ ప్రతినిధి పవన్‌కుమార్ పాల్గొని ఉద్యోగ అవకాశాలు, విద్యార్థులకు ఉండాల్సిన నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులు ఉద్యోగాలను సులువుగా సాధించేందుకు ఎంతో ఉపయోగపడతాయని కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ తెలిపారు. కార్యక్రమంలో డీన్ వివేకానందన్, టీపీఓ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి పంటను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు



వరిని పరిశీస్తున్న పద్మకుమారి, శ్రీధర్

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లోని వరి పంటను ప్రముఖ వ్యవసాయ కీటక శాస్త్ర విభాగం శాస్త్రవేత్తలు ఏపీ పద్మకుమారి, వై.శ్రీధర్ ఇతర అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. వరి పంటలో రెక్కల పురుగులు కనిపించడంతో నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. పురుగులను సేకరించి తమ ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించి నివారణ కోసం కొత్త పద్ధతులు కనుగొంటామన్నారు. రెక్కల పురుగుల నివారణకు ఎకరాకు 10 కిలోల కార్బో ఫ్యూరడాన్ గుళికలు చల్లాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తల సహాయకులు శ్రీనివాస్, తిరుత్కర్, మండల వ్యవసాయ అధికారి బాసిత్, సహాయ అధికారి జగదీశ్, అన్నదాతలు మంకయ్య, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



గుండ్లపోచంపల్లిలో మున్సిపల్ చైర్ పర్సన్, కౌన్సిలర్లు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలకు చెందిన పలువురు లబ్ధిదారులకు బుధవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మేడ్చల్ మున్సిపాలిటీకి చెందిన విజయలక్ష్మి రూ. 39 వేలు, బాలమ్మలకు రూ. 29,500లకు సంబంధించిన చెక్కులను గురువారం మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తన నివాసంలో మున్సిపల్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు భాస్కర్‌యాదవ్‌తో కలిసి పంపిణీ చేశారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన 19 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 6,81,000 చెక్కులను మున్సిపల్ చైర్ పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, బాలరాజ్, హేమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా తుది ఓటరు జాబితాను సిద్ధం చేయండి

కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి



అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి తప్పులు లేని ఓటరు జాబితాను సిద్ధం చేయాలని కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బూత్ లెవల్ ఆఫీసర్స్‌కు ఓటరు జాబితా తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ... తప్పుల సవరణ, మిస్సింగ్, చిరునామా మార్పు కోసం ఫామ్–8ని పూర్తి చేయాలన్నారు. 20 ఏళ్లు పైబడిన వారు ఓటు నమోదు కోసం వస్తే వారి పూర్తి వివరాలు సేకరించాలని, అనుమానం ఉంటే నమోదుకు అవకాశం ఇవ్వొద్దన్నారు. డబుల్ ఓట్లు కలిగి ఉన్నవారి వివరాలు తీసుకొని జాబితా నుంచి ఒక ఓటును తొలగించాలన్నారు. అక్టోబర్ 29న తుది జాబితా ప్రకటించాలని, తప్పులు దొర్లితే సూపర్ వైజర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజేందర్, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ వెంకట్‌రెడ్డి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆందోళన



ఆందోళన చేపట్టిన కాంట్రాక్ట్ ఉద్యోగులు

ఘట్‌కేసర్: ప్రభుత్వ ఆస్పత్రి కాంట్రాక్ట్ ఉద్యోగులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయచంద్ర మాట్లాడుతూ... ఆస్పత్రిలో పనిచేసే శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి మూడునాలుగా నెలలుగా కాంట్రాక్టర్ వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందుల పాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేపు, మాపు అంటూ సమయం గడుపుతున్నారన్నారు. సేవలకు విఘాతం కలుగరాదని ఓపికతో ఉన్నామన్నారు. అధికారులు స్పందించి కార్మికులకు వేతనాలు ఇప్పించాలని, లేని పక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ అనురాధకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు భాగ్యలక్ష్మీ, స్వరూప, శివమ్మ, పుష్ప, ప్రేమ, బాలమణి, నాగమ్మ, ప్రేమలత పాల్గొన్నారు.

చెరువు లీకేజీకి మరమ్మతులు



లీకేజీకి మరమ్మతులు చేయిస్తున్న ఏఈ పరమేశ్

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లోని శ్రీ లక్ష్మీనారాయణ చెరువు కట్టకు ఏర్పడిన లీకేజీని ఇరిగేషన్ ఏఈ పరమేశ్ గురువారం పరిశీలించారు. అనంతరం సంచుల్లో మట్టి నింపి లీకేజీని అరికట్టారు. ఏఈ మాట్లాడుతూ... లీకేజీపై ఆందోళన చెందాల్సిన అవరం లేదన్నారు. తరచూ కట్టను పరిశీలించాలని రైతులు, మత్స్యకారులకు సూచించారు.

ఇష్టారాజ్యంగా చెత్త వేయొద్దు

మల్కాజిగిరి: పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యతగా గుర్తించి బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ సూచించారు. గురువారం ఓల్డ్ మల్కాజిగిరిలో పర్యటన సందర్భంగా స్థానికులు బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్థల యజమానిని పిలిపించి చెత్త తీయించామన్నారు. గతంలో నీటి సరఫరాలో ఇబ్బందులు ఉండేవని జంక్షన్ చేయడంతో ప్రెషర్ పెరిగిందన్నారు. చాలాచోట్ల రోడ్లు దెబ్బతిన్నాయని వాటి స్థానంలో సీసీరోడ్ల నిర్మాణం చేపడతామన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని డాక్టర్ ప్రకాష్‌రావు నగర్‌లో భూగర్భ డ్రైనేజీ పనులకు చైర్మన్ కొండల్‌రెడ్డి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని వార్డుల్లో మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. వైస్ చైర్మన్ రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు వైద్య పరీక్షలు

మేడ్చల్: మేడ్చల్ ఆర్టీసీ డిపో ఆవరణలో గురువారం వైద్య శిబిరాన్ని డీఎంసుధాకర్ ప్రారంభించారు. డిపోలోని ప్రతి ఉద్యోగి వారి కుటుంబ సభ్యులకు ఈ నెల 20వ తేదీ వరకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ రామారావు, అసిస్టెంట్ ఇంజినీర్ స్నేహలత, ఉద్యోగులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం



పూజల్లో పాల్గొన్న ఫౌండేషన్ సభ్యులు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని పోచారంలో సుభాష్ చంద్రబోస్ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గురువారం ఎస్‌వైఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు సామల యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సామల సందీప్‌రెడ్డి, పోచారం పీఎస్ ఇన్‌స్పెక్టర్ బి.రాజు, ఎస్ఐ బద్దం నాగార్జునరెడ్డి, సుభాష్ చంద్రబోస్ అసోసియేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు, టీం ఎస్ఎస్ఆర్ సభ్యులు పాల్గొన్నారు

టీవీ మరమ్మతు చేస్తామని మోసం

- బాధితుడి నుంచి తీసుకున్న మొత్తం డబ్బును ఇచ్చేయండి
- సర్వీసింగ్ సెంటర్‌ను ఆదేశించిన రంగారెడ్డి వినియోగదారుల కమిషన్

సిటీకోర్టులు: మంచి టీవీ కొందాం అని ఎంతో ఆశతో టీవీ షోరూంకి వెళ్లి మార్కెట్‌లో మంచి పేరు ఉన్న సోనీ టీవీ కొనుగోలు చేస్తే ఏడాది కాలంలో పలుమార్లు రిపేర్ చేయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. టీవీ రిపేరు చేయడంలో సత్యదేవ్ సర్వీసెస్ కంపెనీ విఫలం కావడమే కాకుండా బాధితుడి నుంచి ఇష్టారాజ్యంగా డబ్బులు దండుకున్నందుకు ఆ కంపెనీపై రంగారెడ్డి వినియోగదారుల కమిషన్ తీవ్రంగా మండిపడింది. బాధితుడి నుంచి తీసుకున్న రూ. 22 వేలను 9 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని, అంతేకాకుండా రూ. 5 వేలు పరిహారం, మరో రూ. 5 వేలు కోర్టు ఖర్చులకు అందజేయాలని రంగారెడ్డి వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు చింటిని లతాకుమారి, మెంబర్లు జె.శ్యామల, జవహర్‌బాబులతో కూడిన బెంచ్ ఇటీవల ఆదేశాలు జారీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

వివరాలివీ...

మేడ్చల్ జిల్లా నారపల్లికి చెందిన హెర్‌మెన్ కాపర్ 2022లో 'సోనీ మేక్ 43' టీవీని కొనుగోలు చేశాడు. టీవీ స్టార్ట్ చేసినా నుంచి టీవీలో లైన్స్ వస్తూ బొమ్మ సరిగా రావడం లేదని పిటిషనర్ సోనీ టీవీ కంపెనీని ఆశ్రయించాడు. దీంతో వారు పరిశీలించి రిపేర్ చేయలంటే ఖర్చుతో కూడుకున్నది కాబట్టి మీరు టీవీ మర్చుకొని మరొకటి తీసుకోవాలని సూచించారు. దీనికి అంగీకరించని పిటిషనర్ అదే టీవీని ఉంచుకోవాలని అనుకున్నాడు. దీంతో 'జస్ట్ డయల్.కం' కొన్ని రిపేర్ సెంటర్లు చూసిన అతడు 2022 ఏప్రిల్ సత్యదేవ్ సర్వీసెస్ సెంటర్‌ను ఆశ్రయించి విషయం తెలిపాడు. దీంతో టీవీని పరిశీలించిన వారు 3 సంవత్సరాల గ్యారంటీతో రూ. 13 వేలు అవుతుందంటూ రూ. 12.5 వేలకు రిపేర్ చేయడానికి అంగీకరించి చేసి ఇచ్చారు. అయితే 3 సంవత్సరాల గ్యారంటీ ఇచ్చినా.. 2022 అక్టోబర్‌లో అంటే కేవలం 6 నెలల్లోనే మళ్లీ టీవీ ఇబ్బంది పెట్టడం ప్రారంభించింది. వెంటనే బాధితుడు సత్యదేవ్ సర్వీసెస్ సెంటర్ సిబ్బందికి సమాచారం అందించగా వారు బాధితుడి ఇంటికి వచ్చి టీవీని పరిశీలించి, మదర్‌బోర్డు పోయిందని, దాన్ని రిపేర్ చేయడానికి రూ. 12 వేలు అవుతుందని చెప్పిన వారు, రూ. 9.5 వేలకు ఒప్పుకున్నారు. అనంతరం టీవీ రిపేర్ పూర్తి చేసిన తర్వాత వారు బాధితుడి ఇంటికి డెలివరీ పెట్టారు. టీవీ ఇంటికి రాగానే బాధితుడు వారికి ఆన్‌లైన్‌లో రూ. 9.5 వేలు ట్రాన్స్‌ఫర్ చేసి టీవీని డెలివరీ తీసుకున్నాడు. తర్వాత టీవీ ఓపన్ చేసి చూస్తే టీవీ స్క్రీన్ ఖాళీగా కనిపించింది. దీంతో షాక్‌కు గురైన బాధితుడు వెంటనే సర్వీస్ సెంటర్ సిబ్బందికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా సమాధానం ఇవ్వలేదు. తర్వాత కొద్దిరోజులకు సర్వీస్ సెంటర్ ఏజెంట్ ఒకరు బాధితుడి ఇంటికి వచ్చి టీవీ పరిశీలించి ఈ సారి రిపేర్ చేయాలంటే రూ. 22 వేలు అవుతుందని వెల్లడిస్తూ ఆ డబ్బు చెల్లించకుంటే మరమ్మతులు చేయలేమని చెప్పాడు. దీంతో తాను మోసపోయాయని గుర్తించిన బాధితుడు రిపేర్ లేకుండా టీవీని మీరే రూ. 25 వేలకు తీసుకోవాలని కోరాడు. దీనికి ఆ ఏజెంట్ మేము తీసుకోలేమని చెప్పి వెళ్లిపోయాడు. దీంతో బాధితుడిని వారు కావాలనే మోసం చేశారని గుర్తించి రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. దీనిపై విచారణ చేపట్టిన కమిషన్ బాధితుడి నుంచి తీసుకున్న మొత్తం డబ్బును 45 రోజుల్లోగా చెల్లించాలని సత్యదేవ్ రిపేర్ సర్వీసెస్ సెంటర్‌కు ఆదేశాలు జారీ చేసింది.

నకిలీ వైద్యుడి అరెస్టు

కీసర: వచ్చీరాని వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నకిలీ వైద్యుడిని ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకొని కీసర పోలీసులకు అప్పగించారు. కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య సమాచారం మేరకు... డీ ఫార్మసీ చదివిన బండ సాయివర్ధన్‌రెడ్డి ఎంబీబీఎస్ వైద్యుడిగా అవతారమెత్తాడు. నాగారం నుంచి దమ్మాయిగూడకు వెళ్లే మార్గంలో లతాశ్రీ మల్టీ స్పెషాలిటీ పేరుతో ఆస్పత్రి ప్రారంభించాడు. పక్కా సమాచారంతో రంగంలో దిగిన మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసులు గురువారం జిల్లా వైద్యాధికారులతో కలిసి ఆస్పత్రిలో తనిఖీలు చేశారు. ఆయనను అరెస్ట్ చేసి కారు, రూ. 8500తోపాటు రోగులకు సంబంధించిన ఫైల్స్ స్వాధీనం చేసుకున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు: ఇద్దరికి తీవ్ర గాయాలు



ధ్వంసమైన కారు ముందు భాగం

కీసర: రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన ఓ కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివీ... కుందన్‌పల్లి చౌరస్తాలోని వర్ధన పాఠశాల వద్ద గురువారం ఈ ప్రమాదం జరిగింది. రాంపల్లిదాయరకు చెందిన దూసరి సాకేత్(21), ఇంద్రసేనారెడ్డి(21) కారులో నగరానికి వెళ్తున్నారు. రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వేగంగా వెళ్లి ఢీ కొట్టారు. దీంతో కారులో వారికి తీవ్ర గాయాలయ్యాయి. వైద్యం కోసం క్షతగాత్రులను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది.